విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
# తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 141 | బుధవారం 23. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## ‘పని అడిగిన ప్రతి ఒక్కరికి పని’

ప్రతి పంచాయతీకి రూ.50 లక్షలు

మంత్రి సీతక్క



హైదరాబాద్ తెలంగాణ వాణి) ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఇతర ఉన్నతాధికారులతో ఆమె ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ఎల్‌నినో యాక్షన్ ప్లాన్‌పై సమగ్రంగా చర్చించి, అవసరమైన చర్యలపై తీర్మానాలు చేయాలని ఆమె సూచించారు. అన్ని గ్రామాలకు ఒకే రకమైన ప్రణాళిక కాకుండా, స్థానిక అవసరాలు, అందుబాటులో ఉన్న నిధులను బట్టి ప్రాధాన్యతా క్రమంలో పనులను ఎంపిక చేయాలని మంత్రి తెలిపారు. గ్రామ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వేదికలైన గ్రామసభలను సద్వినియోగం చేసుకుని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రాష్ట్రంలో రూ.6.700 కోట్లు మిగతా 2లో..

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు



మహదేవ్‌పూర్ : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలోని దేవస్థానం ఈవో కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పోలీస్, అటవీ, దేవాదాయ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు మంచి స్పందన

ఔత్సాహిక ఫిలిం మేకర్స్ విజ్ఞప్తి మేరకు అక్టోబర్ 2 వరకు గడువు పొడిగింపు

జ్యూరీ కమిటీలతో సమావేశంలో నిర్ణయం



హైదరాబాద్:(తెలంగాణ వాణి) బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఔత్సాహిక ఫిలిం మేకర్స్ విజ్ఞప్తి మేరకు పోటీలో పాల్గొనే గడువును అక్టోబర్ 2 వరకు పొడిగించారు. సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, జ్యూరీ కమిటీ చైర్మన్ హరీష్ శంకర్ ఆధ్వర్యంలో అన్ని జ్యూరీ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. యువతలోని సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు, ఔత్సాహిక ఫిలిం మేకర్స్‌కు తమ ప్రతిభను చాటుకునేందుకు మరింత మిగతా 2లో..



# ఎస్సీ, ఎస్టీ బాధితులకు న్యాయం చేయాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సమావేశం
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం--1989పై రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి నిఘా
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న జరిగిన చివరి సమావేశం
- రాష్ట్రంలో 2023 నుంచి ఇప్పటివరకు మొత్తం 7,563 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసులు
- బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సత్వరమే విడుదల చేయాలి
- ఇందిరమ్మ స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది
- గత ప్రభుత్వంపై మంత్రి అడ్లూరి తీవ్ర విమర్శలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం--1989పై రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న జరిగిన చివరి సమావేశం తర్వాత, రాష్ట్రంలో పూర్తిస్థాయిలో నిర్వహించిన తొలి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి సమావేశం ఇదే కావడం గమనార్హం. ఈ సమావేశంలో ఎస్సీ, సంక్షేమ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో చూస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధితులకు సత్వర న్యాయం, నష్టపరిహారం, పునరావాసం అందేలా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 2023 నుంచి ఇప్పటివరకు మొత్తం 7,563 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసులు నమోదయ్యాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. అనంతరం బాధితులకు అందజేసే నష్టపరిహారాన్ని బడ్జెట్‌తో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సత్వరమే విడుదల చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇక రాష్ట్రంలో నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయంపై సీఎం స్వయంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## 105 సార్లు విరాళాల చోరీ

సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారణ

రామ మందిరంలో భారీ కుంభకోణం

8 మంది అరెస్ట్ 25 నాటికి ఛార్జిషీట్

ట్రస్టు ఉన్నత పదవుల నుంచి చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తొలగింపు



హైదరాబాద్ తెలంగాణ వాణి) అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మిగతా 2లో..



## తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వర్షాలు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో ఇవాళ, రేపు (మంగళ, బుధవారాల్లో) భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ (ఔమ్‌ప్రవతీ =వజూశీతీ) వెల్లడించింది. ఇవాళ 8 జిల్లాలకు అతి భారీ, 20 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అతి భారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రానున్న 12 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

## నీటి విషయంలో తెలంగాణను ముంచింది బీఆర్ఎస్ కాదా?: కాంగ్రెస్

హైదరాబాద్:(తెలంగాణ వాణి)
బీఆర్ఎస్ నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని, కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రులు వాకిటి శ్రీహరి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆక్షేపించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నీళ్ల కోసం కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నామని చెప్పారు. జూరాల డ్యామ్ వద్ద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని మంత్రి వాకిటి మండిపడ్డారు. “ప్రస్తుతం నీరు ఎంత అందుబాటులో ఉంది? తాగునీటి అవసరాల కోసం ఎంత నీరు అవసరమో తెలుసా? రైతులకు మేలు జరగాలనే ఉద్దేశం బీఆర్ఎస్ నేతలకు లేదు. 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు సరిపోతాయని నాడు మీరు చెప్పలేదా? నీటి విషయంలో రాష్ట్రాన్ని ముంచింది ఎవరు? రాష్ట్ర రైతులపట్ల మరణశాసనం రాసింది మీరు. రైతులు, వ్యవసాయ పేటెంట్



కాంగ్రెస్‌దే” అని వాకిటి శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్ నేతలు నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం కాళ్లు పట్టుకోవాలని బీఆర్ఎస్ అంటోందన్న ఆయన.. రైతుల కోసం కాళ్లు మొక్కితే తప్పేముందని ప్రశ్నించారు. “ నీటి అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నాం.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాశాం.

## సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మీడియా అకాడమి చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ తెలంగాణ వాణి) జర్నలిస్టులు వృత్తి నిర్వహణలో టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో కృత్రిమ మేధలో, టూల్స్ ం టెక్నిక్స్, వర్క్ షాపు ను తెలంగాణ మీడియా అకాడమీ, డాటా లీడ్స్, గూగుల్ న్యూస్ ఇనిషివేటివ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్ కు చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన జర్నలిస్టులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం వృత్తి రంగంలో జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని మిగతా 2లో..

## రిమ్స్ ఘటన పై మంత్రి ఆరా



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో సోమవారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ ఘటన తీవ్ర విషాదం నింపింది. చిన్నారులకు చికిత్సలు అందించే ఎస్ఎన్‌సీయూ వార్డులో ఏసీ పేలడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. ప్రమాదం జరిగిన వెంటనే ఇచ్చోడకు చెందిన సబాఖానం కుమార్తె మరణించగా.. ప్రైవేట్ ఆసుపత్రిలో ఇంద్రవెల్లి మండలం గిన్నెర గ్రామానికి చెందిన సక్కుబాయి కూతురు మృతి చెందింది. ఉట్నూర్‌కు చెందిన సప్రీన్ కుమార్తెను మంగళవారం ఉదయం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. రిమ్స్‌లో మొత్తం 27 మంది చిన్నారులు చికిత్స తీసుకుంటుండగా.. ముగ్గురు మృతి చెందారు. మరో 24 మంది చిన్నారులు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన విషయం తెలు సుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిస్థితిని సమీ క్షించారు. అనంతరం మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే పాయల్ శంకర్ రిమ్స్‌కు చేరుకొని బాధితులను పరామర్శించారు.



## నీళ్లివ్వమంటే అరెస్టులా?

02

రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

ఎండిన పంటలకు నీళ్లివ్వాలంటే అరెస్ట్

బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారు

సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ

## ఎల్లుండి దానం పిటిషన్ విచారణ

పార్టీ ఫిరాయింపుల కేసులో దానంను అనర్హుడిగా ప్రకటించిన హైకోర్టు

హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన దానం

దానం పిటిషన్ ను బుధవారం విచారించనున్న సుప్రీంకోర్టు




హైదరాబాద్ తెలంగాణ వాణి) ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను పదవి నుంచి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన సంచలన తీర్పుపై దేశ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సమ్మతించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ అంశాన్ని ప్రస్తావించగా, ఈ పిటిషన్‌ను బుధవారం మిగతా 2లో..

## తండ్రి ఆశయాల సాధనకు తనయుడి సేవలు



**తల్లాడ, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
దివంగత సీనియర్ రాజకీయ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి--ప్రేమలత జ్ఞాపకార్థం ఆయన తనయుడు, కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులకు టీ-షర్టులు పంపిణీ చేశారు. తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతానని కిషోర్ తెలిపారు. భవిష్యత్‌లో మండలవ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో గొడుగునూరి లక్ష్మారెడ్డి, గోవింద్ శ్రీనివాసరావు, దుండేటి వీరారెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, కోసూరు వెంకటేశ్వరరావు, దిరిశాల నరసింహారావు, మారెళ్ల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక



**ఖమ్మం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని 21 మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నాయకులు సమావేశానికి హాజరయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్లంపల్లి యాదగిరి, అధ్యక్షుడిగా దొండ దుర్గయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి. రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.కె. జానీ మియా, కోశాధికారిగా గుమ్మడిపల్లి సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం సాధనతో పాటు సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడుతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా, మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు తెలిపారు.

## వినాయక మండపంలో ఉచిత వైద్య శిబిరం

**సుమారు 200 మందికి వైద్య పరీక్షలు, మందుల పంపిణీ**



**ఖమ్మం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
ఖమ్మం నగరంలోని 56వ డివిజన్ వేణుగోపాల్ నగర్-1లోని వినాయక మండపం వద్ద చల్లగుండ్ల సాయి తేజ, టీమ్ హయగ్రీవ, పి.నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్, సాయిరాం హాస్పిటల్ సహకారంతో సుమారు 200 మందికి బీపీ, షుగర్, కంటి, దంత, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. టీమ్ హయగ్రీవ సభ్యులు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్. సిద్దు, బి. మురళీకృష్ణ, సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్, పి. కృష్ణ, ఎం. గిరిధర్, ఎం. నిశాంత్ తదితరులు పాల్గొన్నారు. సాయిరాం హాస్పిటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపి శ్యామ్‌ను సన్మానించారు.

## రాజస్థాన్ నుంచి మల్కాజిగిరికి డ్రగ్స్ సరఫరా.. ఇద్దరు అరెస్ట్

మల్కాజిగిరి: మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తితో పాటు వినియోగదారుడిని మల్కాజిగిరి ఎస్ఓటీ, పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 23 గ్రాముల ఎండీఎంఏ, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,600 నగదు, ఓ హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.2.76 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మహావీర్ సింగ్ (28) హైదరాబాద్‌లో రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి ఎండీఎంఏను హైదరాబాద్‌కు తీసుకువచ్చి వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన లక్ష్మణ్ సింగ్ రాజ్‌పురోహిత్ (45) క్యాటరింగ్ పనులు చేస్తూ మహావీర్‌కు స్నేహితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. అతను ఎండీఎంఏ వినియోగదారుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ క్రమంలో సెప్టెంబర్ 21 మధ్యాహ్నం మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలోని వేపచెట్టు వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా వేచి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. సాక్షుల సమక్షంలో తనిఖీ చేయగా.. హ్యాండ్‌బ్యాగ్‌లో పాలిథిన్ కవర్లలో దాచిన ఎండీఎంఏ డ్రగ్ లభ్యమైంది. పరీక్షల్లో అది 23 గ్రాముల ఎండీఎంఏగా నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌కు చెందిన కుల్దీప్ డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు, కోకాపేట్‌కు చెందిన కైలాష్ మరో వినియోగదారుడిగా ఉన్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. కుల్దీప్, కైలాష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని పేర్కొన్నారు.

మల్కాజిగిరి ఎస్ఓటీ, మల్కాజిగిరి పోలీసులు సమన్వయంతో పనిచేసి డ్రగ్స్ సరఫరాను అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు. డ్రగ్స్ విక్రయాలు, వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ అరెస్టులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఎస్ఓటీ డీసీపీ కె. మనోహర్, మల్కాజిగిరి జోన్ డీసీపీ చ. శ్రీధర్, ఐపీఎస్, అదనపు డీసీపీ ఎం.డి. షాకీర్ హుస్సేన్ తదితరుల మార్గదర్శకత్వంలో జరిగినట్లు పోలీసులు తెలిపారు.

# భక్తిభావం సమాజ హితానికి దోహదపడాలి

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
సమాజంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరిసి ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలనే సద్భావనకు గణేష్ నవరాత్రులు నిదర్శనమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని రైటర్ బస్తీ త్రిమాత దేవాలయం, రామవరంలోని వానందాస్ గడ్డ, పోస్ట్ ఆఫీస్ సెంటర్, మేదరబస్తీలోని భగత్ సింగ్ కాలనీల్లో ఉత్సవ కమిటీలు నిర్వహించిన వినాయక మండపాలను ఆయన సందర్శించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, బండి నర్సింహా, కూరపాటి సుధాకర్, యూసఫ్, దినేష్, పండు, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బంజారా కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

**విద్యానగర్ కాలనీలో స్థలం కేటాయింపు**

**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బంజారా కమ్యూనిటీ భవన్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం బంజారా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బంజారాల సంక్షేమానికి సహకరిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా తెలిపారు. ఎమ్మెల్యే చొరవతోనే బంజారా భవన్ ఏర్పాటు సాధ్యమైందని మేయర్ మూడ్ గణేష్ అన్నారు. స్థలం కేటాయించిన ఎమ్మెల్యే కూనంనేని, సాబీర్ పాషా, మేయర్ గణేష్‌కు జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ రాథోడ్, బానోత్ రాములు, బానోత్ రవి, కున్సోత్ రాంచందర్, కున్సోత్



ప్రసాద్, బానోత్ మాన్‌సింగ్, ఎల్.వి. వెంకటేశ్వర్లు, ధరావత్ కాన్షీరామ్, గుగులోత్ కేశవ్, గుగులోత్ భద్రు, గుగులోత్ చందర్, బానోత్ భరత్, సపావట్ రవి, నూనావత్ హతీరాం, అజ్మీరా లైలా, బానోత్ రాందాస్, ధరావత్ మురళీకృష్ణ, మాళోత్ శంకర్, భూక్య మోహన్, సపావట్ బాలకృష్ణ, జర్పుల బిక్కులాల్, భూక్య శ్రీనివాస్, జర్పుల ఉపేందర్, గోవింద్, గుగులోత్ విష్ణు, ఇస్లావత్ శంకర్, కేళోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి : ఆర్. కృష్ణయ్య

కార్వాన్: రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు సరైన వసతులు లేక వేలాది మంది చదువుకు దూరమవుతున్నారని, వెంటనే 100 బీసీ కాలేజీ హాస్టళ్లు, 50 బీసీ గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్, కడారి శివకుమార్ యాదవ్ అధ్యక్షతన బీసీ సంక్షేమ సంఘం, బీసీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వేలాది మంది విద్యార్థులు మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్రంలో 52 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభాకు ప్రస్తుతం ఉన్న గురుకులాలు ఏమాత్రం సరిపోవడం లేదని ఆయన అన్నారు. అదనంగా 50 బీసీ గురుకులాలను మంజూరు చేయడంతో పాటు హాస్టళ్లలో 20 శాతం, గురుకులాల్లో 10 శాతం సీట్లను పెంచాలని డిమాండ్ చేశారు.

**ఒక్క హాస్టల్‌కు కూడా సొంత భవనం లేదు**

రాష్ట్రంలో 325 బీసీ కాలేజీ హాస్టళ్లు, 330 బీసీ గురుకులాలు ఉన్నప్పటికీ.. ఒక్కదానికి కూడా సొంత భవనం లేకపోవడం విచారకరమని కృష్ణయ్య అన్నారు. ఫ్లైఓవర్లు, ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం బీసీ హాస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించకపోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తక్షణమే సొంత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

**మూసివేసిన హాస్టళ్లను తెరవాలి**

సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో మూసివేసిన బీసీ హాస్టళ్లను వెంటనే పునఃప్రారంభించాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే



తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ అడ్మిషన్లను కేవలం ఆన్‌లైన్ ప్రక్రియకే పరిమితం చేయకుండా, అత్యంత పేద, సంచార జాతులకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యతనిస్తూ సీట్లు కేటాయించాలని కోరారు. అడ్మిషన్ల పేరుతో బ్రోకర్లు, పైరవీకారులు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా అరికట్టాలని, అలాంటి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులతో విద్యార్థుల ఇబ్బందులు**

హైదరాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం వంటి ప్రధాన జిల్లాల్లో ప్రైవేట్ హాస్టళ్ల ఫీజులు భరించలేక బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కృష్ణయ్య తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పాటిల్, బీసీ/ఎస్సీ/ఎస్టీ/మైనార్టీ హాస్టల్ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మోడీ రాందేవ్, రాజు నేత, సురేష్ గౌడ్, కే. వంశీ, రాష్ట్ర అధికార ప్రతినిధి దొడ్డిపల్లి రఘుపతి, ఆర్‌కే గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలి : మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవ్‌పూర్ : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేసి వచ్చే ఏప్రిల్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరంలోని దేవస్థానం ఈవో కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, పోలీస్, అటవీ, దేవాదాయ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీపడవద్దని స్పష్టం చేశారు. దేవుడి నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో గోదావరి పుష్కరాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని శ్రీధర్‌బాబు తెలిపారు. కాళేశ్వరం క్షేత్రానికి ఉన్న ప్రత్యేక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని పుష్కరాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు అవసరమైన మట్టి సేకరణతో పాటు ఇతర అనుమతుల ప్రక్రియను అటవీ శాఖ అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని కోరారు. పనుల ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ అధికారులు కాళేశ్వరంలోనే ఉండి పనులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పనుల పురోగతిని కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ ఎప్పటికప్పుడు పరిశీలించి, అవసరమైన సమన్వయం చేయాలని సూచించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి కాళేశ్వరం క్షేత్ర ప్రాశస్త్యాన్ని మరింత పెంచాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఈవో కార్యాలయంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరి, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఉపాధిహామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ దండు రమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజాబాబు, దేవాలయ శిల్పి స్థపతి బాలసుబ్రహ్మణ్యం, దేవాలయ చైర్మన్ మోహన్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల రక్షణకు కట్టుబడి ఉంటాం



**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
కార్మికుల హక్కులు, సంక్షేమానికి సంపూర్ణంగా కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి కార్పొరేషన్ కార్మికులకు రెండేళ్లకు సంబంధించిన యూనిఫారాలు, కాస్మొటిక్స్ పంపిణీ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు పనిస్థలాల్లో భద్రత, వేతనాల పెంపు, చట్టబద్ధమైన హక్కులు, సదుపాయాల అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, ధనలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కంచర్ల జమలయ్య, యూసఫ్, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాకు సీతారామ జలాలను ఇవ్వాలి

**మంత్రుల జలదోపిడీని అరికట్టాలి**



**కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
సీతారామ ప్రాజెక్టు నీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మారుమూల ప్రాంతాల రైతులకు అందించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నరసయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండలం వినోబానగర్‌లోని సీతారామ ప్రాజెక్టు కాల్వను పార్టీ ప్రతినిధి బృందంతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని రైతులకు నీరు అందించకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు పనులు, కాల్వల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, జాటోత్ కృష్ణ, అమర్లపూడి రాము, ఏదులాపురం గోపాలరావు, భానోత్ ధర్మ, ఎస్.కె. యాకుషావలి, కల్లూరి కిషోర్, బుర్ర వెంకన్న, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్, బైరు వెంకన్న, రాయల సిద్దు పాల్గొన్నారు.

## భారీ వర్షం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పొన్నం



నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితిపై జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్లతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలోని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద జీహెచ్ఎంసీ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని , వాటర్ లాగింగ్ లేకుండా చూడడంతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్, ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అత్యవసరం కాని ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకుని, వర్షాల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో భారీ వర్షాలపై పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

## భైంసాలో ఘనంగా వినాయక శోభాయాత్ర



**నిర్మల్--భైంసా, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: భైంసా పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర ఘనంగా ప్రారంభమైంది. గణేష్‌నగర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, సబ్‌కలెక్టర్ సంకేత్, మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్, ఏఎస్పీ సాయికిరణ్, బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లడ్డూ వేలం పాటలో ఎస్పీ జానకి షర్మిల రూ.21,100కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గడ్డన్న ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఎస్పీ జానకి షర్మిల, మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి, ఏఎస్పీ సాయికిరణ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేలా యువత పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

## పోషకాహారం లోపిస్తే పిల్లల్లో అనారోగ్యం తప్పదు



**చిగురుమామిడి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేఖరి):**
ముల్కనూర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య పాల్గొని మహిళలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ 'మన అంగన్‌వాడీ--మన బాధ్యత' పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు మావురమ్మ, మంగ, ఏఎన్ఎం మమత, ఆశా వర్కర్లు సహాయదా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేఖరి):**
పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలానికి రూ.4.94 కోట్లు, మల్లాపూర్ మండలానికి రూ.4.27 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పుష్కర ఘాట్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎండోమెంట్స్ కమిషనర్‌తో చర్చించి ప్రత్యేక చొరవ చూపిన కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావుకు మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఘాట్ల నిర్మాణంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం జిల్లా బాధ్యులుగా భాస్కర్‌రెడ్డి, చిరంజీవి

**నల్గొండ, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**





: తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని నియమించారు. గుండ్లపల్లి మండలం శాంతిగూడెం గ్రామ సర్పంచ్ చింతలపూడి భాస్కర్‌రెడ్డిని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, చందంపేట మండలం చిత్రియాల గ్రామ సర్పంచ్, అడ్వకేట్ చిరంజీవి చాట్లను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి వారి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి, చిరంజీవి చాట్ల మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ సర్పంచుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.తమకు అవకాశం కల్పించిన తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రతినిధులు, జిల్లా సర్పంచులు, గ్రామ ప్రజలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. భాస్కర్‌రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్కు, చిరంజీవి చాట్ల డా. ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్, రమావత్ రవీంద్రకుమార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నాయిని చెరువులో గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నాయిని చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పరిశీలించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో భక్తులు అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు పొనగంటి విష్ణు, పొనగంటి రాము, సీఐ రామకృష్ణ, ఏఈ వికాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం అభివృద్ధి పనులపై మంత్రి తుమ్మల సమీక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ఖమ్మం నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్ దత్‌తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపడం, బుగ్గవాగు ఎత్తిపోతల పనులు, మున్నేరు రక్షణ గోడ, కేబుల్ బ్రిడ్జి, రహదారులు, సాగు--తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, వెలుగుమట్ల కాలనీ అభివృద్ధి, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భూగర్భ కేబుళ్లు, పాఠశాలలు, హాస్టళ్ల పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. రబీ సీజన్‌కు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సెప్టెంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలని, ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని ఆదేశించారు. వెలుగుమట్ల కాలనీని నవంబర్ 21లోగా అన్ని మౌలిక వసతులతో ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలని సూచించారు. ఖమ్మం నగర విద్యుత్ అవసరాల కోసం పదేళ్ల



ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ

**ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి : మంత్రి దామోదర రాజనర్సింహ**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమగ్ర విచారణకు ఆదేశించారు. మంగళవారం రిమ్స్‌ను సందర్శించిన మంత్రి ప్రమాదం జరిగిన వార్డును పరిశీలించి, చిన్నారుల పరిస్థితి, సహాయక చర్యలు, అందుతున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాథమికంగా ఏసీ యూనిట్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, దట్టమైన పొగ వ్యాపించినట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఘటనపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి





ఎలక్ట్రికల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలని ఆదేశించారు. భద్రతా ప్రమాణాల్లో నిర్లక్ష్యం బయటపడితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రిమ్స్‌లో 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనం ఏర్పాటు చేసి, ఆస్పత్రిని సుమారు 950 పడకల స్థాయికి అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హెమటాలజీ, ఎమర్జెన్సీ విభాగాలతో పాటు పీజీ సీట్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో డా. సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలాపూర్‌లో ఘనంగా గణేష్ నవరాత్రులు



**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 22, (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరం పేట పట్టణం తిర్మలాపురం కాలనీ లో గత 9 రోజులు గా వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.. మహిళా మణుల మంగళ హారతి పాటలు శ్రవణా నందకరంగా ఉండి, భక్తులు అలౌకిక ఆనందం లో మునిగి తేలుతున్నారు. గణేశుడికి గరిక పూజ, శాకాంబరీ అలంకారం, కుంకుమార్చన, అనేక రకాల తీపి పదార్థాలు నైవేద్యం గా సమర్పించడం అన్నదానం, కోలాటాలు, భజనలు, తో కాలని మొత్తం భక్తి పారవశ్యం తో తన్మయత్వం చెందుతున్నారు. రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ వైదిక నిర్వహణ ఆహుతులను ఆకట్టుకుంది.

## ఎస్‌జీఎఫ్ క్రీడలకు మైదానం సిద్ధం



**డిండి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేవరకొండ నియోజకవర్గ స్థాయి 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు ఈ నెల 24, 25 తేదీల్లో గుండ్లపల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ డిండి ప్రాజెక్టు పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కన్వీనర్ జయమ్మ తెలిపారు. ఎనిమిది మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్న నేపథ్యంలో మైదానాన్ని చదును చేసి పోటీలకు సిద్ధం చేస్తున్నారు. డిండి సర్పంచ్ నల్లగంతుల రవి మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీడీ జె. చంద్రయ్య, ఇద్దయ్య, రంగానాయక్, తస్లీమ్, యాదయ్య, నవనీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు

## టీడబ్ల్యూజేఎఫ్ మహాసభను జయప్రదం చేయండి




**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఈనెల 27న నారాయణఖేడ్‌లో జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) 3వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం నాయకులు పుట్టి సంజీవ్ కుమార్, ఎం.ఏ. ఖైసర్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, అక్రిడిటేషన్, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య సదుపాయాలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

## గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



**వీణవంక, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రేపు జరిగే గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండలంలోని నిమజ్జన ప్రదేశాలను అధికారులు పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రజలు అధికారులకు సహకరించి, సూచనలు పాటించాలని కోరారు.

# మోహన్‌రావుపేటలో ఘనంగా పోషణ మాసం

**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలం ముండ్రపేటలో మోహన్‌రావుపేట సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ అలేఖ్య ఆధ్వర్యంలో పోషణ మాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, బాలామృతం, సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ సరికెళ్ల లతిక నరేష్ మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో అవసరమన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సారెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు చిక్యాల పద్మ, దొడ్డి లక్ష్మి, మౌనిక, ఆశ



కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

## మంత్రి దామోదరకు కలెక్టర్ స్వాగతం



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేఖరి):**
ఆదిలాబాద్ పర్యటన అనంతరం స్వల్ప విరామం కోసం నిర్మల్ కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, శాఖ కార్యదర్శి డా. క్రిస్టియానా జె. చోంగ్తూలకు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో మంత్రి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్వో రాథోడ్ రమేష్, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీవో దేవీదాస్, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 7వ వార్డులో సీసీ పనులకు శ్రీకారం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎమ్మెల్యే మదన్‌మోహన్ ఇచ్చిన హామీ మేరకు ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 7వ వార్డులోని ముదిరాజ్ సంఘంలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, వైస్ చైర్మన్ భాగ్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ 7వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, సహకరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిల్ బాడీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు

## ఎల్లారెడ్డి నూతన డీఈకి ఘన సన్మానం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ నూతన డీఈగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. డివిజన్‌లోని నాలుగు మండలాల్లో విద్యుత్ సౌకర్యాల కల్పనతో పాటు ప్రజలకు ఏఈలు, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు అందుబాటులో ఉండి పారదర్శకంగా సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు లింగమయ్య, సమాచార సంరక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయకోటి గోపాల్, బీఎస్పీ ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షుడు మర్గ సాయిబాబు, పట్టణ నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ ఘటనపై తెలంగాణ రక్షణ సేన ఆందోళన



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఐసీయూలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ముగ్గురు పసిపిల్లలు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రక్షణ సేన నాయకులు ఆసుపత్రిని సందర్శించారు. ఘటనకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పిల్లల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, రిమ్స్ డైరెక్టర్ రాజీనామా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వేణుగోపాల్ యాదవ్, ఎంపీ ఇన్‌చార్జి మాడవి బాపురావు, యువజన అధ్యక్షుడు అసపు ప్రమోద్, నాయకులు కార్తీక్, మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

**రాయికోడ్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**




రాయికోడ్ మండల కేంద్రంలో మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎఫ్ఎల్ఎన్ అమలు, విద్యార్థుల అభ్యసన స్థాయిల మెరుగుదల, 'ఏక్ పేడ్ మా కే నామ్ 3.0', ఎకో క్లబ్స్ ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన తదితర అంశాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. సమావేశంలో ఎంఈవో నర్సిములు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సంగీత, నగేష్, హెచ్‌ఎం శ్రీనివాస్, ఆర్పీలు తులసి, మల్లేశం, సూరీష్, శ్రీహరి పాల్గొన్నారు.

## ముస్తఫాకు ఘన సన్మానం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన ఎం.డి. ముస్తఫాను రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బెందే నాగభూషణం గౌడ్, ఎం.డి. తాజ్, సాధుల శివ తదితరులు పాల్గొని ముస్తఫాకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్లాస్టిక్ రహితంగా మహా అన్నప్రసాద వితరణ




**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
కోరుట్ల పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద వినాయక మండపంలో ప్లాస్టిక్ రహితంగా మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తొలుత పంచలోహ విఘ్నేశ్వర విగ్రహానికి ఆవుపాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అన్నప్రసాదం వితరణ చేశారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్‌కు బదులుగా స్టీల్ ప్లేట్లు, గ్లాసుల్లో ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుమ్లాపూర్ గ్రామ వార్డు మెంబర్ అడ్లగట్ల సురేష్, ఈశ్వర్ నగర్ ఉప సర్పంచ్, కోరుట్ల మండల ఉప సర్పంచ్ల ఫోరం ఉప అధ్యక్షుడు బసవెని రమేష్, వోడ్నాల రామారావు సౌజన్య మరియు యువ నాయకులు, సాధక్ లు, సాయి కృష్ణ, సురేష్, అభినవ్, సంజీవ్, శ్రీనివాస్, శశి, వీర మహిళలు కవిత, లహరి జగిత్యాల పట్టణ సాధక్ సతీష్, మెట్ పల్లి నుండి జిల్లా సీనియర్ నాయకులు ఆనంద్ గౌడ్, ఏలుగందుల అజయ్, మారుతి, సనత్ మల్లాపూర్ నుండి పెంబి మహేందర్, రాంప్రసాద్ మరియు ఆర్మూర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు చిరంజీవి, రాము లు పాల్గొన్నారు.

## గంధమాల అజయ్ ఆచూకీ తక్షణమే కనుక్కోవాలి

### బాధిత కుటుంబానికి ఎంఆర్పీఎస్ అండ






**కీసర, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
: కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 20 రోజులుగా కనిపించకుండా పోయిన గంధమాల అజయ్ ఆచూకీని వెంటనే కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్‌కుమార్ మాదిగ కోరారు. అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేసి అజయ్ కుటుంబానికి భరోసా కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేశారు. సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ ద్వారా విషయం తెలుసుకున్న ఎంఆర్పీఎస్ నాయకులు అజయ్ తల్లిదండ్రులను పరామర్శించి, పోలీసు అధికారులతో కేసు పురోగతిపై చర్చించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తులో పురోగతి కనిపిస్తోందని, అజయ్ ఆచూకీ త్వరగా తేల్చాలని శ్రీనివాస్ కోరారు. బాధిత కుటుంబానికి అజయ్ ఆచూకీ లభించే వరకు ఎంఆర్పీఎస్ అండగా ఉంటుందని ప్రణయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కీసర మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు బకని కుమార్ మాదిగ, మండల ఇన్‌చార్జి బుడిగే జగన్ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు విజయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## గరం గరంగా మండల పరిషత్ సమావేశం

### సమస్యలపై గళమెత్తిన సర్పంచులు



**ధర్మారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల పరిషత్ సాధారణ సమావేశం ప్రత్యేక అధికారి అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీశారు. విద్యుత్ లైన్ల సమస్యలు పరిష్కరించాలని, కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. బొట్లవనపర్తి సర్పంచ్ సంఘ రంజిత్ యాదవ్ డిజిటల్ పంట సర్వే, రైతు అవగాహన సమావేశాలపై ప్రశ్నించారు. మోతే కనకయ్య నంది మేడారం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించాలని కోరారు. ఆసుపత్రిలో పరికరాలు, సిబ్బంది కొరత కారణంగా ఆలస్యం అవుతోందని డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఎంపీడీవో వేముల సుమలత మాట్లాడుతూ కొత్త పెన్షన్ల కోసం 914 దరఖాస్తులు వచ్చాయని, నాలుగు క్లస్టర్లుగా విభజించి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచులు, డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఏఓ ప్రకాశ్, విద్యుత్ ఏఈ మునీందర్‌రెడ్డి, ఏపీవో రవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బ్లాండిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అంజనీపుత్ర గణేశుడికి కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే పూజలు

**ప్రజల సుఖశాంతుల కోసం ప్రత్యేక ప్రార్థనలు**

**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
: మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడ 100 ఫీట్ల రోడ్డులో ఏర్పాటు చేసిన అంజనీపుత్ర గణేష్ మండపాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంగళవారం సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు.మండప నిర్వాహకులు, వేద పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పోలీసు, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.





## రూ.80 వేల లంచం.. జీపీవో అరెస్ట్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో ఏసీబీ అధికారులు మంగళవారం దాడి నిర్వహించారు. పెద్దంపేట గ్రామానికి చెందిన రైతు మహమ్మద్ ఫకీర్‌కు సాదాబైనామా పట్టా మార్పిడి చేసేందుకు జీపీవో దుర్గాప్రసాద్ రూ.80 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పథకం ప్రకారం లంచం తీసుకుంటుండగా దుర్గాప్రసాద్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలో గణపతి హోమం



**నస్పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
నస్పూర్‌లోని టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద లోకకల్యాణార్థం గణపతి హోమాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండేటి అరుణ యోగేశ్వర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమంతో పాటు వేతన సవరణ, కరువు భత్యాలు, పాత పింఛను విధానం, ఆరోగ్య పథకం, పెండింగ్ బిల్లుల సమస్యలు పరిష్కారం కావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కస్తూరి నాగేశ్వర్, హబీబ్ హుస్సేన్, సైండ్ల మొండయ్య, పుప్పాల హనుమంతరావు, పొన్న మల్లయ్య, బొడ్డు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో గాయపడిన 61 ఏళ్ల కార్మికుడు



**రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న ఎమ్మర్ల ఎల్లయ్య విధుల్లో ఉండగా ప్రమాదానికి గురయ్యారు. టవర్ వాగన్‌పై పనిచేస్తుండగా అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. తొలుత మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం అనంతరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.ఎల్లయ్య పరిస్థితిని తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ రాజారమేష్ ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. అవసరమైన పరీక్షలు చేయించి చికిత్స అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులకు భరోసా కల్పిస్తూ వైద్య ఖర్చులు, ఇతర అవసరాలపై తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.కార్మికుల భద్రతపై చైర్‌పర్సన్ ప్రత్యేక సూచనలు చేశారు. వయసు పైబడిన సిబ్బందికి వారి శారీరక సామర్థ్యానికి తగిన విధులు అప్పగించాలని, మున్సిపాలిటీలో పనిచేసే ప్రతి కాంట్రాక్ట్ కార్మికుడికి బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## ఆధ్యాత్మిక వేడుకలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయి

**పెద్దపల్లి , సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను డీసీసీ ప్రధాన కార్యదర్శి, జీడీ నగర్ మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య సందర్శించారు. కుక్కలగూడూర్, జీడీ నగర్, బసంత్‌నగర్‌లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మండప నిర్వాహకులు, గ్రామస్తులకు సూచించారు. భక్తులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆధ్యాత్మిక వేడుకలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని సూర సమ్మయ్య పేర్కొన్నారు.

## సర్వీస్ రోడ్డు పనుల పర్యవేక్షణ



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
మంచిర్యాల డీసీపీ భాస్కర్ మంగళవారం బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ సమీపంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు, అండర్ బ్రిడ్జి పనులను పర్యవేక్షించారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారుప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారి సంస్థ సహకారంతో సర్వీస్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, చీకటి ప్రాంతంలో 14 విద్యుత్ స్తంభాలతో వెలుగుల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్, రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్, జాతీయ రహదారి అధికారులు, సర్పంచ్ శ్రీనివాస్, బొలిశెట్టి కనకయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినికి గాయం చేసిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



**భువనగిరి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేకరి):**
భువనగిరి శివారులోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల/కళాశాలలో 8వ తరగతి విద్యార్థినిని ఓ టీచర్ కర్రతో కొట్టడంతో కంటికి గాయమైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థినికి వెంటనే వైద్యం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించిన ఆయన, ఘటనపై పై అధికారులకు సమాచారం ఇవ్వని ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఫిజికల్ డైరెక్టర్‌ల పాత్రపైనా విచారణ జరపాలని కోరారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ భాస్కర్‌రావు, డీఈవో బిక్షపతి, జీసీడీవో అండాలు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

## వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి



**వేములవాడ, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న వినాయక నిమజ్జనానికి ట్యాంక్‌బండ్‌పై అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. లైటింగ్, మౌలిక వసతులతో పాటు భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ లోకేష్, పట్టణ సీ.ఐ వీరప్రసాద్, కౌన్సిలర్లు, అన్వేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు



**నిర్మల్ - కుబీర్: సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కుబీర్ మండలంలోని దొడర్నా నంబర్--1 రామ్‌నాయక్ తండాలో శ్రీ జగదాంబ దేవి,శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజుకలశ పూజ,యజ్ఞ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు, భక్తులు హాజరయ్యారు.

## నాగారంలో ఉచిత వైద్య, కంటి పరీక్షా శిబిరం



**నాగారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
నాగారం డివిజన్ ఓల్డ్ మార్కెట్ రోడ్‌లోని వినాయక మండపం వద్ద జై భవానీ యువ సమితి ఆధ్వర్యంలో మహేష్ కాశపాక నిర్వహణలో ఉచిత జనరల్ మెడికల్, కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. అపోలో, శ్రీకర హాస్పిటల్స్, నియో విజన్ హెల్త్ వైద్యులు ఆధునిక పరికరాలతో స్థానికులకు ఉచిత వైద్య, కంటి పరీక్షలు నిర్వహించి సూచనలు అందించారు. శిబిరాన్ని సందర్శించిన మాజీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, దాసోహం నర్సింహారావు, మామిడి జంగారెడ్డి, అక్కల సురేష్, షేక్ గౌస్, ప్రవీణ్ యాదవ్, రాజు గౌడ్, నుచ్చు భాస్కర్ యాదవ్, పెరబోయిన మహేష్, మామిడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



**మంచిర్యాల, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలంతా మతసామ రస్యంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య సూచిం చారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని గూడెం తదితర ప్రాంతాల్లో నిమజ్జన ప్రదేశాలను అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ వెలుగులు, క్రేన్లు, బారికేడింగ్, తాగునీరు, పారిశుధ్యం, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బం ది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించాలని తెలిపారు.

## అధికారుల వేధింపులపై పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు అధికారుల వేధింపులు, పనిభారం, రక్షణ పరికరాల కొరతపై ఆవేదన వ్యక్తం చేశారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ సునిల్, ముక్కద్దం శ్రీనివాస్ పనివేళల్లో తమపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.పనిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ గాయపడిన కార్మికులకు సరైన సహాయం అందడం లేదన్నారు. ఏటా ఇవ్వాల్సిన యూనిఫాం, టవళ్లు, సబ్బులతో పాటు బూట్లు, చేతి తొడుగులు వంటి రక్షణ పరికరాలు కూడా అందడం లేదని తెలిపారు. సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి, రక్షణ పరికరాలు అందించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరారు.

తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
GENERAL
బుధవారం
23. 9. 2026
telanganavanidaily


## ఆధ్యాత్మిక వేడుకలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయి



**పెద్దపల్లి , సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను డీసీసీ ప్రధాన కార్యదర్శి, జీడీ నగర్ మాజీ సర్పంచ్ సూర సమ్మయ్య సందర్శించారు. కుక్కలగూడూర్, జీడీ నగర్, బసంత్‌నగర్‌లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని మండప నిర్వాహకులు, గ్రామస్తులకు సూచించారు. భక్తులు, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆధ్యాత్మిక వేడుకలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందిస్తాయని సూర సమ్మయ్య పేర్కొన్నారు.

## వేములవాడలో గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత



**వేములవాడ, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణేష్ నిమజ్జనం, శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పట్టణంలోని సుమారు 320 గణేష్ మండపాల నేపథ్యంలో ప్రధాన కూడళ్లలో పికెట్లు, పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మండపాల నిర్వాహకులు నిర్ణీత సమయానికి నిమజ్జనం పూర్తి చేసి పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి పాల్గొనడం, రెచ్చగొట్టే పాటలు, బాణాసంచాతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## గోపాల్‌పేట్‌లో ఘనంగా శివపార్వతుల కల్యాణం



**నాగిరెడ్డిపేట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో శ్రీ సాయినాథ్ యూత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు. సర్పంచ్ రాఘుపల్లి వంశీకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## యువ సంస్కృతి, వారసత్వ పోటీల్లో బాలుర కళాశాల విద్యార్థుల ప్రతిభ



**హుస్నాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ఆర్‌సీ):**
సిద్దిపేటలోని టిటీసీ భవన్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సంస్కృతి, వారసత్వ జిల్లా స్థాయి పోటీల్లో హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. షార్ట్‌ఫిల్మ్, స్కిట్, పీపిటీ ప్రజెంటేషన్, పరిసరాల పరిశుభ్రత, వారసత్వ సంపద అంశాల్లో విద్యార్థులు పాల్గొన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలోని చారిత్రక, పర్యాటక, వారసత్వ ప్రదేశాల ప్రాధాన్యతను ప్రదర్శనల ద్వారా వివరించారు. విద్యార్థుల ప్రతిభను కళాశాల ప్రిన్సిపాల్ చెన్నూరి గంగాధర్ అభినందించారు. పాల్గొన్న విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

## చేయూత పింఛన్ దరఖాస్తుదారుల పరిశీలన



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
: వెంకటాపూర్ గ్రామంలో చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపీడీవో రామకృష్ణ పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలు, అర్హతలను అధికారులు నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల మేరకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ద్యాగ గంగాధర్ కోరారు. కార్యక్రమంలో దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# మద్యానికి మంత్రి ఉన్నారు.. విద్యకు మంత్రి ఎక్కడ?

**మెదక్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రాష్ట్ర ప్రభుత్వంలో మద్యానికి మంత్రి ఉన్నప్పటికీ విద్యారంగానికి ప్రత్యేక మంత్రి ఎందుకు లేరని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మెదక్ టీఎన్‌జీవో భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా 20వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు అధ్యక్షతన నిర్వహించారు. మణికంఠరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడంపై పునరాలోచించాలని, మెదక్‌లో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఖలీక్, జిల్లా కార్యదర్శి దినకర్, రాష్ట్ర గర్ల్స్ వింగ్ కో-కన్వీనర్ కండె విజేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చ రమేష్, జిల్లా ఆఫీస్ బేరర్ పాపయ్య, నాయకులు తేజ, శివ, సంజన, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# గరం గరంగా మండల పరిషత్ సమావేశం

**సమస్యలపై గళమెత్తిన మహిళా సర్పంచులు**

**ధర్మారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి): ˀ**
ఎద్దపల్లి జిల్లా ధర్మారం మండల పరిషత్ సాధారణ సమావేశం ప్రత్యేక అధికారి అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, మిడిల్ పోల్స్ ఏర్పాటు, డిజిటల్ పంట సర్వే, రైతు అవగాహన సమావేశాలు, వైద్య శిబిరాలు, ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ సేవలపై సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. చామనపల్లి సర్పంచ్ వేల్పుల రేవతి, గోపాల్‌రావుపేట సర్పంచ్ సౌజన్య, న్యూ కొత్తపల్లి సర్పంచ్ మల్లేశం విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. బొట్లవనపర్తి సర్పంచ్ సంఘ రంజిత్ యాదవ్, కిలావనపర్తి సర్పంచ్ మోతే కనకయ్య, నందిమేడారం సర్పంచ్ వీర్పాల్ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నందిమేడారం 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరగా ఇన్‌పేషెంట్ సేవలు ప్రారంభించాలని సర్పంచులు కోరారు. మండలంలో కొత్త పింఛన్ల కోసం 914



దరఖాస్తులు రాగా, నాలుగు క్లస్టర్లుగా విభజించి పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో వేముల సుమలత తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ఉదయ్‌కుమార్, ఏవో ప్రకాష్, ఏఈ మునీందర్‌రెడ్డి, ఏపీవో రవి, ఐసీడీఎస్ సూపర్వైజర్ బ్లాండిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఏ "వసూళ్ల" దందా

- 2,500 ఇస్తేనే బండి విడుదల
- కాళ్లు మొక్కినా కనికరించని వైనం
- రశీదు లేకుండానే నగదు గుంజేసిన అధికారులు

**కరీంనగర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
తిమ్మాపూర్ మండల కేంద్రం పరిధిలో వాహన తనిఖీల పేరుతో ఆర్‌టీఏ అధికారుల చేతివాటం మళ్లీ తీవ్ర కలకలం రేపుతోంది. నిబంధనల ప్రకారం చలానాలు విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సిన అధికారులే, జేబులు నింపుకోవడమే ధ్యేయంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం తిమ్మాపూర్ ఆర్‌టీఏ కార్యాలయం సమీపంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద అధికారులు సాగించిన తనిఖీల పర్వం తీవ్ర వివాదాస్పదంగా మారింది. చింతకుంట గ్రామం నుండి సిద్దిపేటకు ఇటుకల లోడుతో వెళ్తున్న ఒక డీసీఎం వ్యాన్‌ను ఆర్‌టీఏ అధికారులు అడ్డుకున్నారు. వాహనంలో నిర్ణీత పరిమితి కంటే మూడు టన్నుల ఇటుకల లోడ్ ఎక్కువగా ఉందంటూ డ్రైవర్‌ను భయభ్రాంతులకు గురిచేశారు. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ జరిమానా రశీదు జారీ చేయకుండా, రూ. 2,500 నగదు చెల్లిస్తేనే బండిని ఇక్కడి నుంచి కదలనిస్తాం.. లేదంటే సీజ్ చేస్తాం అంటూ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వాహన డ్రైవర్ సార్ నేను పేదవాడిని, రోజువారీ కూలీ పని చేసుకుని పొట్టపోషించుకునే గరీబోన్ని..అంత డబ్బు నా దగ్గర లేదు అని అధికారుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడి కన్నీరుమున్నీరైనా అధికారులు ఎంతో నిర్దయగా వ్యవహరించారని డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు.



**ప్రైవేటు వ్యక్తులతో దందా జేబుల్లోకి సొమ్ము**
చివరకు డ్రైవర్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చి రూ.2,500 వసూలు చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంగా అధికారే నేరుగా తీసుకోకుండా, తన వద్ద పనిచేసే ఓ సిబ్బందిని పంపి సదరు డ్రైవర్ వద్ద నుంచి రూ.2,500 నగదు తీసుకెళ్లేలా పక్కా వ్యూహం అమలు చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్ ఉంటే నిబంధనల ప్రకారం జరిమానా విధించాల్సింది పోయి, రశీదు లేకుండా నగదు రూపంలోనే దండుకోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల దందా నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.? తనిఖీల పేరుతో సామాన్య, పేద వాహనదారుల రక్తం పిండుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డుపై బహిరంగంగా సాగుతున్న ఈ అక్రమ నగదు వసూళ్ల దందాపై రవాణా శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై ఫిర్యాదు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
మురుమూరు గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ నాయకుడు మగ్గిడి సాగర్ జిల్లా పంచాయతీరాజ్ అధికారిణికి ఫిర్యాదు చేశారు. పంచాయతీకి వచ్చిన నిధులు, అభివృద్ధి పనుల బిల్లులు, ఎంబీ రికార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, కాలువల పనులకు వినియోగించిన జేసీబీల



పనిగంటలపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఆర్‌టీఐ చట్టం కింద పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ప్రజాధనం పారదర్శకంగా వినియోగించడంతో పాటు గ్రామ అభివృద్ధికే ఖర్చు చేయాలని, అవకతవకలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మగ్గిడి సాగర్ కోరారు.



## ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

**ఎండపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
ఎండపల్లి మండలంలోని ఎండపల్లి, కొత్తపేట, రాజారాంపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యంపై అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. డాక్టర్లు లావకుమార్, మౌనిక, సూపర్‌వైజర్ రమణవల్లి పర్యవేక్షణలో జరిగిన శిబిరాల్లో ఏఎన్ఎంలు పద్మ, విజయ, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామీణులకు ప్రాథమిక వైద్య సేవలు చేరువ చేయడమే లక్ష్యమని ఆరోగ్య సిబ్బంది తెలిపారు.

## సత్యనారాయణ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన పద్మ దేవేందర్ రెడ్డి



**మెదక్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మక్త భూపతిపూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కుసంగి సత్యనారాయణ గౌడ్ అమ్మమ్మ సత్యమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి మంగళవారం గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. వారికి మనోధైర్యం కల్పించడంతో పాటు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజ గౌడ్, మాజీ ఎంపీపీ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ ఆంజనేయులు, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ సర్పంచులు చెవిటి అశోక్, గొల్ల గట్టయ్య, మాజీ ఎంపీటీసీ మాదిగుంట యాదగిరి, ఉపసర్పంచ్ బండమీది దుర్గయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో ప్రహరీ గోడ నిర్మాణంపై ఆరోపణలు



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గౌరికుంట తండాలో ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన భూమిలో సర్పంచ్ ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని గ్రామ యువకులు ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం సరికాదని ప్రశ్నించగా, సర్పంచ్ తమపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు దూషించారని తెలిపారు. ఈ ఘటనను వీడియో తీస్తున్న వ్యక్తి నుంచి సర్పంచ్ బంధువు ఫోన్ లాక్కున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాల, గ్రామపంచాయతీకి సంబంధించిన భూమిని కాపాడేందుకు అధికారులు వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## వీవో భవన నిర్మాణానికి సహకరించాలి



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మన్నెంపెల్లిలో నూతన వీవో గ్రామైక్య సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గం సహకరించాలని భరతమాత గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు మార్కొండ లత కోరారు. మహిళా సంఘాలకు కేటాయించిన పాత పంచాయతీ భవనాన్ని ఇటీవల కూల్చివేసిన నేపథ్యంలో, అదే స్థలంలో వీవో భవనం నిర్మించేలా పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని వినాయకునికి పూజలు



**చిగురుమామిడి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేకరి):**
కొండాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ చెట్టు మల్ల రవీందర్, సర్పంచ్ మార్కరాజు, కేడం లింగమూర్తి, వార్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మండప నిర్వాహకులు మంత్రిని శాలువాతో సన్మానించారు.

## భూభారతి రీ-సర్వే పనులను పరిశీలించిన ఆర్డీవో



**మెదక్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
మెదక్ మండలం కొమటూర్ గ్రామంలో జరుగుతున్న భూభారతి రీ-సర్వే పనులను ఆర్డీవో రమాదేవి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల హద్దుల గుర్తింపు, ఫీల్డ్ విజిట్ ప్రక్రియపై అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూ యజమానుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి, భూ రికార్డుల నమోదులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## గణేష్ ఉత్సవాలపై పోలీసుల నజర్



**ధర్మారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
మండల కేంద్రంలోని గణేష్ మండపాలను పెద్దపల్లి సీఐ కే. ప్రవీణ్ కుమార్, ఎస్సై ఎంబడి శ్రీకాంత్ మంగళవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనంలో డీజేలకు అనుమతి లేదని, లాటరీలు నిర్వహించరాదని సూచించారు. సాంప్రదాయ బ్యాండ్ మేళాలతో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## శకల్లలో జాతీయ పోషకాహార వారోత్సవం



**బుగ్గారం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి విలేకరి):**
శకల్ల గ్రామంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు సమతుల్య, పోషకాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పర్స రమేష్, ఉప సర్పంచ్ నర్ల బుచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి సల్లా రజిత, వార్డు సభ్యులు, ఎంఎల్‌హెచ్‌పీ సహాన్య, ఆశా కార్యకర్త పుష్ప, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సత్వర పరిష్కారం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: అంతర్గాంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ కె. మాధవరావు అధ్యక్షతన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రామగుండం సబ్‌డివిజన్ పరిధి నుంచి మొత్తం 7 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో విద్యుత్ బిల్లులకు సంబంధించి 3, విద్యుత్ లైన్లకు 2, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి 2 ఫిర్యాదులు ఉన్నాయి. సమస్యలను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వినియోగదారులు సీజీఆర్ఎఫ్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన అధికారులు, ఏఈ. ఆశా శంకర్, ఆయా సెక్షన్లకు చెందిన వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు

## పాత డిగ్రీ కళాశాలను హాస్టల్‌గా వినియోగించాలి

### ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంటలో నిరుపయోగంగా ఉన్న పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని విద్యార్థుల హాస్టల్‌గా వినియోగించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం భవనాన్ని పరిశీలించిన ఆయన.. భవనం చెక్కుచెదరకుండా ఉన్నప్పటికీ ఎందుకు మూసివేశారో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్నందున, పాత భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులను సమీకరించి ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ కో–కన్వీనర్ గోస్కుల అజయ్, నగర కార్యదర్శి భోగం శశాంక్, రోహిత్, ఆఫ్రిద్, మోయిస్, సల్మాన్, రిషికేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఎద్దు మృతి

### యువ రైతుకు తీవ్ర నష్టం

**వెల్గటూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలో మంగళవారం పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన యువ రైతు బండారి సాగర్‌కు చెందిన ఎద్దు పొలం వద్ద ఉండగా ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 80 వేల నుంచి రూ. లక్ష వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ అధికారులు స్పందించి ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

## ఈసీఈలో కల్లకుంట సునీలకు పీహెచ్.డీ.

**పటాన్ చెరు, సెప్టెంబర్ 22, (తెలంగాణ వాణి)**



గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) పరిశోధక విద్యార్థిని కల్లకుంట సునీల డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సెంట్రాలిటీ కొలతలపై దృష్టి సారించి, గ్రాఫ్ థియరీ టెక్నిక్ లను ఉపయోగించి కీలక నోడ్ గుర్తింపు ద్వారా వైర్ లెస్ సెన్సార్ నెట్ వర్కుల ఆప్టిమైజేషన్'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఈఈసీఈ విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎ.శ్రీనివాస్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.
ఈ అంతర్ విభాగ పరిశోధన, వైర్ లెస్ సెన్సార్ నెట్ వర్కుల శక్తి సామర్థ్యం, విశ్వసనీయత, స్థితిస్థాపకత, డేటా ప్రసార సామర్థ్యాలను మెరుగుపరచడానికి గ్రాఫ్ థియరీ, గణాంకాలు, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లను ఏకీకృతం చేస్తుందని వివరించారు. ఈ పరిశోధనకు పర్యావరణ పర్యవేక్షణ, ప్రెసిషన్ అగ్రికల్చర్, పారిశ్రామిక ఆటో మేషన్, ఆరోగ్య సంరక్షణ, విపత్తు నిర్వహణ, రక్షణ నిఘా వంటి రంగాలలో ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయన్నారు.
తన డాక్టరేట్ ప్రస్థానంలో, డాక్టర్ సునీల పది పరిశోధనా పత్రాలను ప్రచురించడమే గాక, ఐఐటీ హైదరాబాదు, బిట్స్ పిలానీ, హైదరాబాదు ప్రాంగణాల లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులలో తన పరిశోధనను సమర్పించారు. డాక్టర్ సునీల సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం నాయకత్వంతో పాటు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియ జేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

### డిండి మండలానికి గర్వకారణం: ఎంఈవో నర్సింహ



**గుండ్లపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నల్లగొండ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న డిండి మండలానికి చెందిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎనిమిది మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో అవార్డులు పొందడం మండలానికి గర్వకారణమని ఎంఈవో పగిడిపాటి నర్సింహ అన్నారు. ఈ అవార్డులు ఉపాధ్యాయుల్లో మరింత ఉత్సాహాన్ని నింపి, బాధ్యతను పెంచుతాయని పేర్కొన్నారు. అవార్డు గ్రహీతలు పగిడిపాటి నర్సింహ, టి. బ్రహ్మచారి, ఇస్లావత్ గోప్యనాయక్, వింజమూరి యాదయ్య, కే. హరిలాల్, కి. శ్యాంసుందర్, జి. రామారావు, జె. సరితలను మండల విద్యాశాఖ అధికారులు అభినందించారు.

# గురువులే నవ సమాజ నిర్మాతలు

- గురువుల చేతుల్లోనే భావి భారత్ : అదనపు కలెక్టర్ పాండు
- మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి : ఎమ్మెల్యే జీఎంఆర్
- పటాన్‌చెరులో 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని, భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు అన్నారు. పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. సందర్భంగా 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గత 25






ఏళ్లుగా గురుపూజోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ పాండు, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించాలని కోరారు. పటాన్‌చెరును ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెల్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల 'గురువులకు పాదాభివందనం' కార్యక్రమానికి ఎమ్మెల్యే రూ. 26 వేల నగదు బహుమతి అందించారు.

## విద్యుత్ షాక్‌తో మృతి చెందిన నాయకుడి కుటుంబానికి పరామర్శ

### నష్టపరిహారం కోసం ఎస్ఈతో ఎమ్మెల్యే బాలు నాయక్ ఫోన్‌లో చర్చ



**చందంపేట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
చందంపేట మండలం బుడ్డోని తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు నేనావత్ దస్రు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. దస్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి నష్టపరిహారం త్వరగా అందేలా విద్యుత్ శాఖ ఎస్ఈతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. పిల్లల చదువులకు ఇబ్బందులు కలగకుండా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో మహిళకు గాయాలు

### జంమ్గి బిలో భయాందోళనలో గ్రామస్తులు



**కంగ్టి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
కంగ్టి మండలం జంమ్గి బి గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం ఉదయం కుమ్మరి లచ్చవ్వపై కోతులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి స్పృహ తప్పింది. స్థానికులు ఆమెను చికిత్స కోసం పిట్లం ఆసుపత్రికి తరలించారు. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ మహిళలు, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. చిన్నారులను బయటకు పంపేందుకు భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి కోతులను నియంత్రించేందుకు చర్యలు చేపట్టి గ్రామస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

## బీజేపీ పోరాటం ఫలితంగానే సాగునీటి విడుదల

**వనపర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



జూరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఫలితంగానే ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు పిలుపుతో జూరాల వద్ద నిర్వహించిన ధర్నాలో పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసినా పోరాటం కొనసాగించామని తెలిపారు. రైతుల పంటలకు అవసరమైన సమయంలో నీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల హక్కుల కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

## పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

**వనపర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ కోరారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఓటరు జాబితాను ప్రతి ఎన్నికకు కొత్తగా రూపొందించే ప్రక్రియలో గతంలో ఓటు ఉన్నవారు కూడా మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం ఎన్నికల అధికారులను లేదా 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## జమ్మికుంట మార్కెట్‌లో కొత్త పత్తి కొనుగోళ్లు ప్రారంభం

### తొలి రోజు క్వింటాలుకు గరిష్ఠంగా రూ.7,272



**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో 2026--27 సీజన్ కొత్త పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న--సదానందం మంగళవారం ప్రారంభించారు. యార్డుకు పత్తి తీసుకొచ్చిన రైతులను సన్మానించి సీజన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. తొలి రోజు బహిరంగ వేలంలో క్వింటాలుకు గరిష్టంగా రూ. 7,272, కనిష్టంగా రూ. 7,011 ధర పలికింది. మురళీకృష్ణ, మల్లికార్జున ట్రేడర్స్ పత్తిని కొనుగోలు చేశారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా పత్తిని నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి బహిరంగ వేలం ద్వారా మెరుగైన ధర పొందాలని చైర్‌పర్సన్ సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం, ఎన్. రాజా, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు, అడ్తిదారులు, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం



**డిండి సెప్టెంబర్ 22( తెలంగాణ వాణి ప్రతినిధి )**
డిండి మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో 9వ వార్డులో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ అన్న ప్రసాద కార్యక్రమానికి చెరుకుపల్లి గ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు యువకులు, మహిళలు శ్రీకృష్ణ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట మొక్కను నాటాలి



**కొమురవెల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల జెడ్పీహెచ్ఎస్‌లో ఎంఈఓ కోనేటి రవి, జిల్లా సైన్స్ అధికారి పి. రాజమౌళి ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించి పెంచాలని ఎంఈఓ, డీఎస్ఓ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్. కనకయ్య, జి. ప్రవీణ్‌కుమార్, వి. భూపతిరెడ్డి, ఆర్. విజయలక్ష్మి, జి. ప్రమోదిని, ఎం. లత, ఉమారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రవణా నక్షత్రం సందర్భంగా దివ్యకళ్యాణం

**తెల్లాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని కొల్లూరు శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారికి దివ్యకళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, కళ్యాణ క్రతువులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

## గణేష్ మండపాలకు ఎస్ఎస్ అన్వర్ బియ్యం పంపిణీ



**పెద్దపల్లి , సెప్టెంబర్ 22(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి )**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ గ్రామంలోని 23 వినాయక మండపాలకు బియ్యం అందజేశారు. ఒక్కో మండపానికి 25 కిలోల చొప్పున మొత్తం 575 కిలోల బియ్యాన్ని నిర్వాహకులకు పంపిణీ చేశారు. అనంతరం మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల ఆయురారోగ్యాలు, గ్రామాభివృద్ధి, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని గణనాథుడిని ప్రార్థించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మండపాల నిర్వాహకులకు సూచించారు.

## డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డిని సన్మానించిన జర్నలిస్టులు



**నారాయణఖేడ్, సెప్టెంబర్ 22.(తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డిని మంగళవారం నారాయణఖేడ్ జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డితో పాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డికి జర్నలిస్టులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యం.ఏ. ఖైసర్, ఆంజనేయులు, డేనియల్, ఇబ్రహీం, శరణప్ప, షయబాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ విద్యుత్ భద్రతా ఏర్పాట్లు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 23 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
వినాయక నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎన్‌పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ పరిధిలో ప్రత్యేక విద్యుత్ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. నిమజ్జన మార్గాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు కంట్రోల్ రూమ్‌లు, ప్రత్యేక సిబ్బంది, వాహనాలు, మరమ్మతు సామగ్రిని సిద్ధంగా ఉంచామని తెలిపారు. పెద్దపల్లి, గోదావరిఖని పట్టణాల్లో మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, సమస్యలు ఉంటే 1912కు లేదా 8712484 198, 8712484165 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## తిరుమలాపూర్ లో ఘనంగా గణేష్ నవరాత్రులు



**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 22, (తెలంగాణ వాణి):**
పెద్ద శంకరం పేట పట్టణం తిర్మలాపురం కాలనీ లో గత 9 రోజులు గా వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.. మహిళా మణుల మంగళ హారతి పాటలు శ్రవణా నందకరంగా ఉండి, భక్తులు అలౌకిక ఆనందం లో మునిగి తేలుతున్నారు. గణేశుడికి గరిక పూజ, శాకాంబరీ అలంకారం, కుంకుమార్చన, అనేక రకాల తీపి పదార్థాలు నైవేద్యం గా సమర్పించడం అన్నదానం, కోలాటాలు, భజనలు, తో కాలని మొత్తం భక్తి పారవశ్యం తో తన్మయత్వం చెందుతున్నారు. రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ వైదిక నిర్వహణ ఆహుతులను ఆకట్టుకుంది.

## కాంగ్రెస్ బలోపేతానికి ఎస్సీలు కృషి చేయాలి



**వనపర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి నియోజకవర్గంతో పాటు జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు ఎస్సీ వర్గాలు కృషి చేయాలని కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం వనపర్తి కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ఎస్సీలను పార్టీతో అనుసంధానం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కొంకి వెంకటేష్, గంధం రాజశేఖర్, కొల్ల వెంకటేష్, ఎత్తం రవి, విభూది మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు



**చిలుకూరు, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
చిలుకూరు మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. చిలుకూరు మండలానికి 13,772, కోదాడ నియోజకవర్గానికి 98,958 నూతన రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం: బీజేపీ



**వనపర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన శాంతియుత ధర్నాలో పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి కొత్తకోట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతూరి బుడ్డన్న మాట్లాడుతూ.. రైతుల పంటలను కాపాడేందుకు వెంటనే జూరాల నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులను ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడంగా అభివర్ణించారు. ధర్నాలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



**వరంగల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. మెడికో–లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పోలీసులను కోరారు. ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డి, నాయకులు తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, పులి రజనీకాంత్, నార్ల గిరి రమేష్, భరత్ కుమార్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## రేపటి భవిష్యత్తు కోసం ఆయుర్వేదం




**చౌటుప్పల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా చౌటుప్పల్‌లోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్, జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా వాక్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ యునాని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ రోజ్ మేరీ విద్యార్థులకు యోగా, ధ్యానం, ఆసనాల ప్రాముఖ్యతను వివరించారు. నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హేమలత, హెచ్‌ఎం నాగమణి, ఫార్మసిస్ట్ డి. సరిత, యోగా ఇన్‌స్ట్రక్టర్లు వి. ఝాన్సీ, పి. సాత్విక్, ప్రకృతి వైద్య నిపుణుడు అశ్విన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కరెంట్‌పై బీఆర్‌ఎస్ ధర్నా



**చౌటుప్పల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. వ్యవసాయానికి వాస్తవంగా ఎన్ని గంటలు విద్యుత్ ఇస్తున్నారో లాగ్‌బుక్ వివరాలు చూపించాలని ఆయన డీఈని కోరారు. అదనంగా రెండు గంటల విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిర్కటి నిరంజన్ గౌడ్, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, చింతల దామోదర్ రెడ్డి, పెద్దిటి బుచ్చిరెడ్డి, మల్లేష్ గౌడ్, నర్రి నరసింహ, కౌన్సిలర్లు, సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## అంతరిక్ష పరిశోధనలో యువత ముందుండాలి




**చిలుకూరు, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
అంతరిక్ష పరిశోధనల్లో యువత ముందుకు రావాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ డా. వి. బాలకిష్టారెడ్డి అన్నారు. చిలుకూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ పాఠశాలలో శక్తి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్పేస్ ఆన్ వీల్స్' ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. గ్రామీణ విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజారామ్, ముక్కపాటి నరసింహారావు, కొల్లు పుల్లమ్మ నాగయ్య, అలసకాని జనార్ధన్, తలారి శ్రీనివాసరావు, ఎన్. శివకుమారి, రంజాన్ బి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు రాకెట్లు, గ్రహాలు, చంద్రయాన్ నమూనాలను ఆసక్తిగా తిలకించారు.

## నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం



**తరిగొప్పుల, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
మండలంలోని గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. భద్రతా చర్యలు, ఏర్పాట్లు, శాఖల సమన్వయంపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. సమావేశంలో ఎస్ఐ శ్రీదేవి, ఎంఆర్ఓ, ఎంపీడీఓ, వివిధ గ్రామాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హన్మంత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మాజీ మహిళా మండల అధ్యక్షురాలు జి. స్వప్న, గడ్డం గాయత్రి, మమత, రాధ ఉన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, ప్రసన్న కుమార్, ఇల్లేష్ యాదవ్, శివాజీ, నాగరాజు, సాయి యాదవ్, రామ్ యాదవ్, తిరుపతిరావు, సి.హెచ్. నాగరాజు, విజయ్ నాయక్, వెంకటేష్, నవీన్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

## ఎంజీఎం వద్ద ఉద్రిక్తత



**వరంగల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
ఎంజీఎం ఆసుపత్రిలో పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనల నేపథ్యంలో ఆసుపత్రిని పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ను పోలీసులు అడ్డుకున్నారని బీఆర్‌ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో ప్రధాన గేటు వద్ద పోలీసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ రోగుల భద్రతపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. తనకు గాయాలు కావడంతో ఎంజీఎంలోనే చికిత్స అందించాలని కోరినప్పటికీ పోలీసులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారని తెలిపారు.




## అరుదైన రక్త సమస్యతో బాధపడుతున్న వృద్ధుడికి పునర్జన్మ

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
ఖమ్మంకు చెందిన 64 ఏళ్ల వ్యక్తి నెల రోజులుగా జ్వరం, తీవ్రమైన నీరసం, రక్తహీనతతో బాధపడుతూ ఏడు సీసాల రక్తం ఎక్కించుకున్నాడు. పరిస్థితి విషమించడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్చగా వైద్యులు పరీక్షలు నిర్వహించి ప్రాథమిక మైలోఫైబ్రోసిస్ అనే అరుదైన మూలుగ సంబంధిత వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. చికిత్సలో భాగంగా రక్త మార్పిడి, యాంటీబయోటిక్స్, ఇతర అత్యవసర చికిత్స అందించగా ఆరోగ్యం మెరుగుపడి పరిస్థితి స్థిరపడింది. పదేపదే రక్తం అవసరమయ్యే వారికి సమగ్ర రక్త, మూలుగ పరీక్షలు కీలకమని వైద్యులు సూచించారు.

## యువతి అనుమానాస్పద మృతి






**జూలూరుపాడు, సెప్టెంబర్ 22 ( తెలంగాణ వాణి)**
మండలం వెంగన్నపాలెం గ్రామంలో ఇంద్రపల్లి సతీష్––రాజేశ్వరి దంపతుల పెద్ద కుమార్తె ఇంద్రపల్లి హరిణి (17) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లోని బాత్‌రూమ్ పక్కన ఆమె మృతదేహం కనిపించినట్లు సమాచారం. మృతదేహంపై గాయాల గుర్తులు కనిపించడంతో ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఘటనకు సంబంధించిన వివరాలను వెలుకి తీస్తున్నారు. యువతి మృతికి గల కారణాలు ఏమిటి? గాయాలు ఎలా ఏర్పడ్డాయనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదికతో పాటు పోలీసుల దర్యాప్తు చేస్తున్నట్టు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్ తెలిపారు. అలాగే అన్ని కోణాలలో కేసును పరిశీలించి, పూర్తయిన అనంతరం మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే వరకు కుటుంబ సభ్యులకు తగు న్యాయం జరుగుతుందని వివరించారు.

## ఈఎంఆర్‌ఎస్ టేకులపల్లిలో క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు



**టేకులపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ టేకులపల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు మూడు రోజులపాటు క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. టేకులపల్లి, గండుగులపల్లి, ములకలపల్లి, చర్ల, పాల్వంచ, గుండాల, సింగరేణి, దుమ్ముగూడెం పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలను 23న ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ నిషాన్ కృష్ణ తెలిపారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

## ఇగ్నోలో కొత్తగా రూరల్ స్టడీస్ డిగ్రీ

**హనుమకొండ, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**



: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై––2026 ప్రవేశాల నుంచి నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ రూరల్ స్టడీస్ ప్రోగ్రాంను ప్రారంభించింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్, గ్రామీణ పాలన, జీవనోపాధులు, సుస్థిర అభివృద్ధి రంగాల్లో నైపుణ్యం కల్పించడం దీని లక్ష్యమని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డా. రాజు బొల్లా, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.వి. రమణారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసిన వారికి ఎకనామిక్స్, హిస్టరీ, సోషియాలజీ, పొలిటికల్ సైన్స్ తదితర విభాగాల్లో ఒక సంవత్సరం మాస్టర్స్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30లోపు ఇగ్నో అడ్మిషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## భూ రికార్డులకు భూదార్ రక్షణ కవచం



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
భూదార్ సర్వేతో భూముల సరిహద్దులు, విస్తీర్ణం డిజిటల్ రికార్డుల్లో శాశ్వతంగా నమోదవుతాయని జాయింట్ కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. జయగిరి గ్రామంలో సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. జీపీఎస్, జియో కోఆర్డినేట్స్ సాంకేతికతతో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వాస్తవ వివరాలు అందించి సర్వేకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ పూజారి కిరణ్‌కుమార్, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, జీపీఓ వనిత, ఉప సర్పంచ్ అరుణ్, అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ బోయ బాల నరసింహ ప్రథమ వర్ధంతి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
పంతంగి గ్రామంలో కామ్రేడ్ బోయ బాల నరసింహ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్తూప ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాల నరసింహ విద్యార్థి, యువజన సమస్యలతో పాటు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, గీత, వృత్తిదారుల సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం అందించేందుకు పోరాడారని తెలిపారు. ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు, అభ్యుదయవాదులు పాల్గొని విప్లవ జోహార్లు, లాల్‌సలాంతో నివాళులర్పించారు.

## రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని వినతి



**చౌటుప్పల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి):**
హైదరాబాద్––విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చౌటుప్పల్ పట్టణంలో నిర్మిస్తున్న బ్రిడ్జ్ వద్ద అదనంగా రెండు అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు ఆర్ఓ శివశంకర్, పీడీకి వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ సమీపంలో, చిన్నకొండూరు––నారాయణపురం చౌరస్తా వద్ద అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఎల్లగిరి చౌరస్తా వద్ద రైతులు, పశువుల రాకపోకలకు 10 అడుగుల వెడల్పు అండర్‌పాస్, కొయ్యలగూడెం వద్ద అండర్‌పాస్‌ను 30 అడుగుల మేర విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల భిక్షం గౌడ్, జిల్లా నాయకులు రమనగోని శంకర్, రెక్కల సత్తిరెడ్డి, కౌన్సిలర్ బుద్ధ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు



**నర్సంపేట, సెప్టెంబర్ 22 (తెలంగాణ వాణి)**
: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 26వ వార్డు శివనగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్, పీసీసీ సభ్యులు పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం యూత్ క్లబ్ సభ్యులు ఆమెను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పంబి వంశీకృష్ణ, మాదాసి రవి, తుమ్మలపెల్లి సందీప్, కాట ప్రభాకర్, మోటం రవి కుమార్ తదితర కాంగ్రెస్ నాయకులు, శివనగర్ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ‘రాకా’లో నటించడం అదృష్టంగా భావిస్తున్నా

## నైలా గ్రేవాల్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా సైన్స్ ఫిక్షన్ విజువల్ డ్రామా ‘రాకా’. సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది. ఇదిలా ఉంటే, ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ బ్యూటీ నైలా గ్రేవాల్ తాజాగా సినిమా విశేషాలను పంచుకున్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ‘రాకా’ తన కెరీర్‌లోనే అత్యంత ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని అన్నారు. ఇండస్ట్రీలో అద్భుతమైన ప్రతిభ, గ్రేట్ ఇంపాక్ట్ ఉన్న నటీమణులతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గొప్ప అవకాశమని చెప్పారు.

ఈ చిత్రంలో ఎంతోమంది టాలెంటెడ్, స్ఫూర్తిదాయకమైన నటులు ఉన్నారని తెలిపారు. ‘రాకా’ సెట్స్ నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని, ఆ అనుభవం తనను ఎంతో ఇన్‌స్పైర్ చేసిందని నైలా పేర్కొన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్ట్‌లో భాగం కావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి వైవిధ్యమైన, ఆసక్తికరమైన పాత్రల్లో నటించడం ఒకరకంగా సవాలుగా అనిపించినప్పటికీ.. ఆ చాలెంజే ఈ ప్రాజెక్ట్‌ను, తన క్యారెక్టర్‌ను మరింత గొప్పగా తీర్చిదిద్దడానికి సహాయపడిందని ఆమె వివరించారు. ఆ రోల్ తనను ఎంతో మార్చేసింది పేర్కొన్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ విజువల్ వండర్ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొంది.

## ‘ఆదర్శ కుటుంబం’ నుంచి ‘నారాయణమ్మ’ ఫస్ట్ సింగిల్ అప్‌డేట్!



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘ఆదర్శ కుటుంబం’ సినిమా నుంచి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి పాటైన ‘నారాయణమ్మ’ సాంగ్‌ను సెప్టెంబర్ 22న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఎస్. థమన్ సంగీతం అందిస్తున్న ఈ పాటపై ప్రేక్షకుల్లో మరియు అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ సరసన శ్రీనిధి శెట్టి, నివేతా థామస్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదలవుతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ సినిమా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## నాని ‘ది ప్యారడైజ్’కు భారీ హైప్..

### పదివేల మంది ఫ్యాన్స్‌తో ప్రత్యేక సమావేశం



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘ది ప్యారడైజ్’. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సెప్టెంబర్ 23 నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ప్రదర్శనలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నాని అభిమానుల్లో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పటికే ‘ది ప్యారడైజ్’ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ రాగా, దాదాపు 2 గంటల 49 నిమిషాల నిడివితో ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయనుంది. మరోవైపు సినిమా నుంచి విడుదలైన ‘ఆయా షేర్’, ‘ఏషనాగుల’ పాటలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సెప్టెంబర్ 21న హైదరాబాద్‌లో ‘ది ప్యారడైజ్’ ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. చిరంజీవి ఈ వేడుకకు హాజరైతే నాని అభిమానులతో పాటు మెగా అభిమానులకు కూడా ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉంది.మరోవైపు నాని ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి తర్వాత పదివేల మంది ఫ్యాన్స్ తో ప్రత్యేక సమావేశం కానున్నారు. దేశ వ్యాప్తంగా నాని ఫ్యాన్స్ ఈ కార్యక్రమానికి రానున్నారని చెబుతుండగా, వారికి వెజ్, నాన్ వెజ్‌తో డెలిషియస్ భోజనం కూడా ఏర్పాటు చేయనున్నార ట. ఈ విషయం తెలిసిన నాని ఫ్యాన్స్ తెగ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ‘ది ప్యారడైజ్’ విషయంలో చిత్ర బృందం మరో ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. ఈ సినిమాకు ప్రత్యేకంగా ట్రైలర్ విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు నాని గతంలో వెల్లడించారు. కథ, సినిమాలోని కంటెంట్‌పై నమ్మకంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా భారీ చిత్రాలకు ట్రైలర్ ద్వారా మరింత ప్రచారం కల్పిస్తారు. కానీ ‘ది ప్యారడైజ్’ విషయంలో మాత్రం అందుకు భిన్నమైన విధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ సినిమాలో నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించింది. ఇప్పటికే విడుదలైన ‘ఏషనాగుల’ పాటలో కీర్తి సురేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరోవైపు కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ‘మాలిక్’ అనే కీలకమైన, శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు.

## సుకుమార్ శిష్యులకు ‘ద్వితీయ విఘ్నం’ టెన్షన్..

### బుచ్చిబాబు తర్వాత శ్రీకాంత్ ఓదెల వంతు!



టాలీవుడ్‌లో దర్శకుడు సుకుమార్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన వద్ద పనిచేసి దర్శకత్వంలోకి వచ్చిన పలువురు యువ దర్శకులు తమదైన శైలిలో సినిమాలు చేస్తూ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా సహజత్వం, రా అండ్ రస్టిక్ కథనాలు, బలమైన భావోద్వేగాలతో సినిమాలను తెరకెక్కించడం సుకుమార్ శిష్యుల పనితీరులో కనిపించే అంశాలుగా మారాయి. అయితే తొలి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకులు రెండో సినిమాతో అదే స్థాయిలో మెప్పిస్తారా? అనే చర్చ ఎప్పటి నుంచో సినీ వర్గాల్లో ఉంది.ప్రస్తుతం ఈ చర్చ సుకుమార్ శిష్యులు బుచ్చిబాబు సానా, శ్రీకాంత్ ఓదెల చుట్టూ తిరుగుతోంది. తొలి సినిమాలతో మంచి విజయాలు అందుకున్న ఈ ఇద్దరు దర్శకులు తమ రెండో చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. బుచ్చిబాబు సానా ‘ఉప్పెన’ సినిమాతో దర్శకుడిగా పరిచ యమయ్యారు. తొలి సినిమా తోనే మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయనకు టాలీ వుడ్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ‘పెద్ది’ అనే భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించే అవకాశం దక్కింది.భారీ అంచనాల మధ్య విడుదలైన ‘పెద్ది’లో రామ్ చరణ్ నటనకు ప్రశంసలు దక్కాయి. అయితే కథనం, కొన్ని పాత్రల రూపకల్పన, నాటకీయత విషయంలో దర్శకుడిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్ర విషయంలో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ అంశంపై బుచ్చిబాబు కూడా స్పందిస్తూ వివరణ ఇచ్చారు.అయితే బాక్సాఫీస్ పరంగా కూడా ‘పెద్ది’పై విడుదలకు ముందు ఉన్న భారీ అంచనాలకు అనుగుణంగా ఫలితం రాలేదనే చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు రెండో సినిమాతో ఎదుర్కొన్న అనుభవాన్ని సినీ వర్గాలు ‘ద్వితీయ విఘ్నం’గా ప్రస్తావిస్తున్నాయి. ఇక ఇప్పుడు మరో సుకుమార్ శిష్యుడు శ్రీకాంత్ ఓదెల రెండో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ‘దసరా’తో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల.. తొలి సినిమాతోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నాని నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించడంతో శ్రీకాంత్ ఓదెలపై అంచనాలు భారీగా పెరిగాయి.ఇప్పుడు నానితోనే మరోసారి ‘ది ప్యారడైజ్’ చిత్రాన్ని తెరకెక్కించారు. దీంతో ఈ సినిమా ఆయన కెరీర్‌లో అత్యంత కీలకంగా మారింది.

## ‘జనవరి 12 విడుదల’లో దీపుగా బేబమ్మ

కృతి శెట్టి పుట్టినరోజు సందర్భంగా ‘జనవరి 12 విడుదల’ చిత్రబృందం ఆమెకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సంక్రాంతి వినోదాత్మక చిత్రంలో కృతి శెట్టిని ‘దీపు’గా పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కృతి శెట్టి సంప్రదాయ హాఫ్ శారీలో కనిపించారు. ఊదా, గులాబీ రంగులతో కూడిన దుస్తుల్లో ఆమె ఎంతో అందంగా దర్శనమిచ్చారు. చారిత్రక కట్టడం బ్యాక్ గ్రౌండ్‌లో కనిపిస్తుండగా.. చిరునవ్వుతో కృతి శెట్టి ఇచ్చిన పోజ్ పోస్టర్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ ద్వారా ఆమె పోషిస్తున్న పాత్ర చాలా సంప్రదాయబద్ధంగా ఉంటుందని క్లారిటీ వచ్చింది.

‘జనవరి 12 విడుదల’ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. విభిన్నమైన టైటిల్‌తో ఇప్పటికే ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ‘బావ బామ్మర్ది సౌజన్యంతో’ అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్ కూడా సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇటీవల వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లతో రూపొందించిన హాస్యభరితమైన వీడియో ద్వారా సినిమా టైటిల్‌ను ప్రకటించారు.ఈ చిత్రంలో కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. వీరితో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటింగ్, ఏఎస్ ప్రకాశ్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ చిత్రాన్ని జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.




## ‘జైలర్ 2’లో బాలీవుడ్ బ్యూటీ విద్యాబాలన్..

### ‘కాంత’గా మాస్ ఎంట్రీ!



సూపర్‌స్టార్ రజనీకాంత్, టాలెంటెడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబి నేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ ‘జైలర్ 2’ నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, తాజాగా విడుదలైన ఒక క్యారెక్టర్ గ్లింప్స్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ నటి విద్యాబాలన్ అత్యంత శక్తిమంతమైన ‘కాంత’ అనే పాత్రలో నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. విడుదలైన ఆమె ఫస్ట్ లుక్ టీజర్‌లో విద్యాబాలన్ స్క్రీన్ ప్రెజెన్స్ చాలా స్టైలిష్‌గా ఉంది. నీలిరంగు చీర, నలుపు రంగు జాకెట్‌లో మెట్లపై నుంచి ఆమె నడుచుకుంటూ వచ్చిన తీరు, గంభీరమైన లుక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు కుంటున్నాయి. చివర్లో ఆమె చెప్పిన పదునైన డైలాగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచిం ది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఈ టీజర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. కేవలం గ్లామర్ పాత్ర కాకుండా, కథను మలుపు తిప్పే ఒక పవర్‌ఫుల్ మరియు మాస్ పాత్రలో విద్యాబాలన్ కనిపించబోతున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com